క్లుప్తంగా

సాయినాథుడికి ప్రత్యేక పూజలు


అలంకరణలో షిర్డీ సాయిబాబా

బేతంచెర్ల: పట్టణంలోని కర్నూలు రహదారిలో వెలసిన షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆశాఢ మాసం గురువారం పురస్కరించుకొని బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాలు, పట్టణంలోని ఆయా కాలనీలకు చెందిన భక్తులు ఉదయం బాబాకు అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి, కాగడ హారతి నిర్వహించారు. అనంతరం ఆలయ సందర్శనకు వచ్చిన భక్తులకు కృపాధామ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

ఉశేన్‌స్వామి దర్గాలో భక్తుల రద్దీ


దర్గాలో ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు గ్రామంలో వెలసిన ఉశేన్‌స్వామి దర్గాకు గురువారం భక్తులు పోటెత్తారు. మొహర్రం ముగియడంతో ఈ వారం భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని స్వామివారికి పూలదట్టీలు, జెండాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జిల్లాతోపాటు కర్నూలు, వైఎస్సార్ కడప, అనంతపురం, తదితర జిల్లాల నుంచి భక్తులు తరలిరావడంతో దర్గా కిటకిటలాడింది.

బాలికలపై వివక్ష చూపరాదు

బనగానపల్లె రూరల్ : తల్లిదండ్రులు బాలికల పట్ల వివక్ష చూపించరాదని హెచ్‌ఎం, రీజనల్ పర్యావరణ సమన్వయకర్త కుమార్‌బాబు సూచించారు. గురువారం మండలంలోని ఇలూర్లు కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో బనగానపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ సాలమ్మ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం జరిగింది. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కుమార్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుతం ఆడపిల్లలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని,వారిని అన్ని రకాలుగా ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

యువత సన్మార్గంలో నడవాలి



మాట్లాడుతున్న సీఐ గంటా సుబ్బారావు

బనగానపల్లె రూరల్ : యువత సన్మార్గంలో నడుచుకోవాలని బనగానపల్లె సీఐ గంటా సుబ్బారావు తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ బాబునాథ్ ఆధ్వర్యంలో విద్యార్థులు– సామాజిక భద్రతపై అవగాహన కార్యక్రమం జరిగింది. సీఐ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలు గుట్కా, ధూమపానం వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేయరాదన్నారు. లక్ష్యాన్ని ఎంచుకొని పట్టుదలతో సాధించాలని చెప్పారు. అధ్యాపకులు సూర్యానారాయణ రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వసుంధరమ్మ, నీతమ్మ, కౌసల్య, రవికుమార్, వహిదా, నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

బనగానపల్లె : స్థానిక రవ్వలకొండపైనున్న ఏపీ మోడల్ స్కూల్ బాలికల, జ్యోతిరావ్ పూలే పాఠశాలల్లో గురువారం టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే జ్వరం, జలుబు, దగ్గు, కడుపు నొప్పి, వాంతులు, విరోచనాలు, మలేరియా, డెంగీ తదితర వ్యాధుల నుంచి రక్షించుకునే జాగ్రత్తలు వివరించారు. ఉపాధ్యాయులు శివయ్య, వార్డెన్ పార్వతీబాయి పాల్గొన్నారు.

వేపచెట్టు నుంచి పాలధార


వేపచెట్టు నుంచి వస్తున్న పాలను చూస్తున్న మహిళలు

కోవెలకుంట్ల: మండలంలోని చిన్నకొప్పెర్ల గ్రామంలోని రాజరాజేశ్వరి ఆలయ సమీపంలో గురువారం వేపచెట్టు నుంచి పాలధార కనిపించింది. చెట్టు నుంచి పాలు వస్తుండటాన్ని గమనించిన భక్తులు అక్కడికి చేరుకున్నారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంఘటనను చూసేందుకు గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామల నుంచి ప్రజలు తరలివచ్చారు.

వరిలో కాలి బాటతో ప్రయోజనాలు

- నాటు వేసే సమయంలో కాలిబాట ఏర్పాటు చేసుకోవాలి
- గాలి, వెలుతురు పుష్కలంగా అంది దిగుబడి పెరిగే అవకాశం


కాలిబాటలతో వరినాట్లు వేస్తున్న కూలీలు

బనగానపల్లె: వరి పంటలో కుదుళ్లను దగ్గరగా నాటడం వల్ల పంటకు తెగుళ్ల ఎక్కువగా సోకే అవకాశం ఉందని, తెగుళ్ల నివారణకు వరి నాట్ల సమయంలో కాలిబాటలను వేసుకుంటే ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. వరి నాట్లలో కాలిబాటలను ఏర్పాటు చేసుకోవడం వల్ల బహుళ ప్రయోజనాలున్నాయని, ముఖ్యంగా పైరు గాలి, సూర్యరశ్మి సక్రమంగా అందడంతో ఏపుగా పెరుగుతుందని బనగానపల్లె మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి తెలిపారు.

కాలిబాటలతో ప్రయోజనాలు..

- వరిలో తెగుళ్ల సమవర్ధవంతంగా తట్టుకునేందుకు ప్రది రెండు మీటర్లకు 20 సెం.మీ దూరంలో కాలిబాటలను వేసుకోవాలి. కాలిబాటలో మొక్కల సామర్థ్యం పెరుగుతుంది.
- పంటకు గాలి సూర్యరశ్మి పుష్కలంగా లభిస్తుంది.
- అగ్గి తెగుళ్లు,సుడిదోమ వ్యాప్తిని అదుపు చేయవచ్చు
- ఎరువులను కాలిబాటల ద్వారా చల్లితే పొలమంతా సమానంగా వేసేందుకు అవకాశం ఉంటుంది. సేంద్రియ ఎరువు మొక్కలకు పూర్తిస్థాయిలో అందుతుంది.
- కిరణ జన్య సంయోగక్రియ అధికంగా జరిగి మొక్కల్లో పత్రహరితం అధికంగా ఉత్పత్తి కావడంతో పంటల దిగుబడులు పెరిగే అవకాశం ఉంది.
- ఎలుకలను సమవర్ధవంతంగా అదుపు చేయవచ్చు. కోత సమయంలో పంట నేలవాలితే నిలబెట్టడానికి అనుకూలంగా ఉంటుంది.

గొచ్చులుగా నాటొద్దు..

- వరి కుదుళ్లను గొచ్చులుగా నాటడం వల్ల పంటకు గాలి, వెలుతురు సక్రమంగా అందక పైరు పెరుగుదల మందగించడంతోపాటు చీడపీడలు త్వరగా ఆశిస్తాయి.
- సాధారణంగా ఎక్కువ వరి మొనలను నాటితే ఎక్కువ దిగుబడి వస్తుందని రైతులు భావిస్తుంటారని, అయితే ఇది సరైన పద్ధతికాదు.
- వరి మొనలలో సాంద్రతే కీలకం. దగ్గరగా నాటడం వల్ల మొక్కలకు అంతర వాతావరణం అనుకూలించక తెగుళ్లు ఎక్కువగా సోకే అవకాశం ఉంది.


కాలిబాట వేసిన వరి పంట

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

బేతంచెర్ల: పట్టణానికి సమీపాన బనగానపల్లె రహదారిలో ఉన్న జగనన్న లేఔట్ కాలనీలో తన ఇంట్లో చోరీ జరిగిందని బాధితురాలు కడుపుల పుల్లమ్మ గురువారం తెలిపింది. కాలనీలో ఇంటి నిర్మాణం చివరి దశకు చేరిందని గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి విద్యుత్ సామగ్రి, మోటార్, పైపులు, డ్రమ్ములు వంటి రూ.20 వేల విలువ చేసే వస్తువులు అపహరించారని వాపోయింది. చోరీ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితురాలు పేర్కొంది.

రేషన్ బియ్యం పట్టివేత

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని చెరువుపల్లె గ్రామంలో 23 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిరుపాల్ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన బోయమధు రేషన్‌బియ్యాన్ని ఆటోలో అక్రమంగా తరలిస్తున్నాడనే సమాచారం మేరకు దాడి చేసి ఆటో, బియ్యాన్ని సీజ్ చేసి నిందితుడి పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నాటుసారా స్వాధీనం

బేతంచెర్ల: మండలపరిధిలోని ముసలాయి చెర్వు గ్రామ సమీపాన కొండ ప్రాంతంలో ముద్దవరం గ్రామానికి చెందిన వ్యక్తి నాటుసారా విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఏఎస్ఐ లింగమయ్య గురువారం తెలిపారు. ఈ దాడుల్లో ముద్దవరంగ్రామానికి చెందిన వీరభద్రుడు నాటుసారా వదిలేసి పారిపోయాడు.ఘటనా స్థలం వద్ద 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసి గాలింపు చేపట్టినట్లు ఏఎస్ఐ వెల్లడించారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య


బావిలో తేలిన నాగలక్ష్మమ్మ మృతదేహం

బేతంచెర్ల: పట్టణంలోని బోయపేట కాలనీకి చెందిన వృద్ధురాలు బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. కాలనీవాసులు తెలిపిన వివరాల మేరకు బోయ హుసేనయ్య, భార్య నాగలక్ష్మమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, కుమార్తె సంతానం. అందరికీ వివాహాలు అయ్యి వేర్వేరుగా ఉంటున్నారు. అయితే కాలనీలో నివాసం ఉంటున్న బోయ హుసేనయ్య, భార్య నాగలక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో మనస్తాపం చెందిన నాగలక్ష్మమ్మ (60) గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లి బనగానపల్లె రహదారిలోని జటాధర స్వామి ఆలయ ఆవరణంలోని బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కొద్దిసేపటి తర్వాత బావిలో మృతదేహం తేలియాడుతుండటంతో అటువైపు వెళ్లిన పాలిష్ బండల ఫ్యాక్టరీ కార్మికులు వృద్ధురాలి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుమారులు చేరదీయకపోవడం, అనారోగ్యంతో బాధపడుతూ విరక్తి చెంది నాగలక్ష్మమ్మ ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.

ఆకుమల్లలో నేడు ఆధార్ ప్రత్యేక శిబిరం

సంజామల: మండలంలోని ఆకుమల్ల గ్రామ సచివాలయంలో శుక్రవారం ఆధార్ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తామని ఎంపీడీఓ విజయకుమార్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ చిన్నారుల ఆధార్ నమోదుతో పాటు మార్పులు చేర్పులు చేసుకోవచ్చని చెప్పారు. ఒక్కరోజు శిబిరాన్ని సచివాలయ పరిధిలోని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేధింపుల కేసు నమోదు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని టంగుటూరు గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి అనే వివాహిత తన భర్త నాగరాజుపై వరకట్నం పేరుతో వేధిస్తున్నారని ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ గురువారం తెలిపారు. కర్నూలుకు చెందిన నాగరాజుతో భాగ్యలక్ష్మికి రెండేళ్ల క్రితం వివాహమైంది. కొంత కాలం నుంచి తనను అదపుకట్నం తీసుకురావాలని కుటుంబ సభ్యులతో కలిసి వేధింపులకు గురి చేస్తున్నట్లు భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఎస్పీ,జేసీని కలిసిన రామ్‌కో ప్రతినిధులు


ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణాకు శుభాకాంక్షలు తెలుపుతున్న రామ్‌కో ప్రతినిధులు

కొలిమిగుండ్ల: జిల్లా అధికారులుగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌ను కల్వటాల సమీపంలోని రామ్‌కో సిమెంట్ యూనిట్ హెడ్ రెడ్డినాగరాజు,ప్రెసిడెంట్ రామరాజు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కంపెనీ పరిధిలోని గ్రామాల్లో సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న అభివృద్ధి,సేవాకార్యక్రమాల గురించి వారికి వివరించారు.

బాలికలను ఉన్నత చదువులు చదివించాలి


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్యాపిలి: ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలని ఎంపీడీఓ సాయిమనోహర్, డిప్యూటీ తహసీల్దార్ మారుతి, సీడీపీఓ షంషాద్ బేగం పిలుపునిచ్చారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం బేటీ పడావో–బేటీ బచావో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించరాదు అనే ఆలోచనను తల్లిదండ్రులు మానుకోవాలన్నారు. బాలికలు ఉన్నతంగా చదివితే కుటుంబం బాగుపడుతుందని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పురుషులతో పోలిస్తే మహిళలు అన్ని రంగాల్లో బాగా రాణిస్తున్నారని చెప్పారు. సరస్వతి శిశు మందిరం హెచ్‌ఎం రామాంజనేయులు, ఉపాధ్యాయులు వాసు తదితరులు పాల్గొన్నారు.

డెయిరీ డిస్ట్రిబ్యూటర్‌పై చీటింగ్ కేసు

కోవెలకుంట్ల: డెయిరీ డిస్ట్రిబ్యూటర్ తీసుకుని డెయిరీకి డబ్బులు చెల్లించకుండా మోసం చేయడంపై గురువారం చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. వివరాలు.. పట్టణానికి చెందిన లక్ష్మిప్రసన్న అనే మహిళ నంద్యాలకు చెందిన సంఘం డెయిరీ డిస్ట్రిబ్యూటర్‌షిప్ తీసుకుంది. పాల సరఫరాకు సంబంధించి డెయిరీకి రూ.5.74 లక్షలు చెల్లించాల్సి ఉంది. డబ్బులు ఇవ్వకపోగా మరో డెయిరీతో ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలుసుకున్న సంఘం డెయిరీ మెనేజర్ సుధీర్ ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలి


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న రవీంద్ర ఆచారి

బనగానపల్లె రూరల్ : ప్రకృతి వ్యవసాయం పద్ధతుల్లో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించి ఆసక్తి పెంచాలని ప్రకృతి వ్యవసాయం మార్కెటింగ్ అధికారి రవీంద్ర ఆచారి తెలిపారు. గురువారం స్థానిక రైతు సహాయ కేంద్రంలో మండల ప్రకృతి విభాగం టీం లీడర్ మున్నీ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలకు మార్కెట్‌లో మంచి గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. ఈ విధానంలో పంటలసాగుకు ఖర్చు తక్కువ, తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుందని, దిగుబడి అధికంగా ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం కూడ రాయితీ ఇస్తుందని రైతులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆదేశించారు. జూలై నెలలో ప్రకృతి వ్యవసాయంలో సాధించిన ప్రగతిపై గ్రామాల వారీగా రివ్యూ నిర్వహించారు.

కమిషనర్ పరిశీలన


క్యాంటీన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ జయరాం

డోన్: స్థానిక కేవీఎస్ కాలనీలో అన్నా క్యాంటీన్ పనులను మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్నాకాంటీన్లను పునఃప్రారంభించేందకు చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా క్యాంటీన్ ఏర్పాటు పనులు, మరమ్మతులు, పరిసరాలను పరిశీలించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ డీఈ రసూల్ వెంట ఉన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి


విద్యార్థులకు ఆరోగ్య సలహాలు ఇస్తున్న వైద్యురాలు

బేతంచెర్ల: విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత శుభ్రత పాటించాలని వైద్యురాలు ప్రియాంక, సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. పట్టణానికి సమీపాన బనగానపల్లె రహదారిలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయంలో గురువారం హెల్త్ ప్రోగ్రాం సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే ఆరోగ్య సలహాలు, సూచనలతోపాటు సీజనరీ వ్యాధులు, డయేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

అనారోగ్యంతో సాధువు మృతి

బనగానపల్లె రూరల్ : నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని అనాథ సాధువు మృతి చెందినట్లు బనగానపల్లె సీఐ గంటా సుబ్బారావు గురువారం తెలిపారు. మండలంలోని యాగంటి క్షేత్రంలో అనారోగ్యంతో ఉన్న సాధువునుఓ వ్యక్తి నాలుగు రోజుల క్రితం చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వా వైద్యశాలలో చేర్పించాడు. అయితే సాధువు చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి వద్ద రమేష్ (74) తండ్రి పేరు రామసుబ్బయ్య అనంతపురం అనే చిరునామా మాత్రమే ఉంది. మృతుడి వివరాలు తెలిస్తే బనగానపల్లె పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి


ఆధార్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మల్‌రెడ్డి

అవుకు: ఆధార్ క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మల్‌రెడ్డి సూచించారు. స్థానిక గ్రామ సచివాలయంలో గురువారం ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని ఎంపీడీఓ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్‌లో ఇంటి అడ్రస్, జిల్లా, పేర్లలో సవరణలు, తదితర మార్పులు చేసుకోవచ్చన్నారు. అలాగే చిన్న పిల్లలకు కొత్త ఆధార్ కార్డులను పొందవచ్చని తెలిపారు. శుక్రవారం మెట్టుపల్లె, శింగనపల్లె, కునుకుంట్ల, ఉప్పలపాడు గ్రామ సచివాలయాల్లో ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు రాణించాలని హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి సూచించారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా 4వ రోజు గురువారం విద్యార్థులచే పలు రకాల ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో ప్రావీణ్యం సంపాదించినప్పుడే జీవితంలో రాణించగలుగుతారన్నారు. అంతే గాకుండ శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసంతో ఆరోగ్యకరమైన జీవితం గడుపుతారన్నారు. అనంతరం ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘తల్లికి వందనం’ త్వరగా అమలు చేయాలి

కోవెలకుంట్ల: కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని త్వరగా అమలు చేయాలని అంబేడ్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మహేష్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఏడాదికి రూ.15 వేల చొప్పున అందజేస్తామని ఎన్నికలకు ముందు కూటమి నాయకులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇంట్లో ఎంత మంది విద్యార్థులు ఉంటే అంత మందికి రూ. 15వేల చొప్పున ఇస్తామని ప్రకటించారని, ఇచ్చిన హామీ మేరకు పేద విద్యార్థుల చదువుకు భరోసా కల్పిస్తూ వెంటనే తల్లి వందన పథకం వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. అక్టోబర్‌లోగా పథకాన్ని కచ్చితంగా అమలు చేయని పక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.

కొనసాగుతున్న లారీ కార్మికుల సమ్మె


కోట్లవారిపల్లె వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: లారీ యజమానులు హుందాగా వ్యవహరిస్తూ సమ్మెను సామరస్యంగా పరిష్కరించుకోవాలని మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య, డోన్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, శివరాం కోరారు. వేతనాలు పెంచాలంటూ లారీ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం మూడవ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా పట్టణ సమీపంలోని కోట్లవారిపల్లె వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుకూలంగా వేతనాలు పెంచాలని కోరారు. అయితే కొందరు యజమానులు కార్మికుల పట్ల అసభ్య పదజాలంతో మాట్లాడుతూ.. భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈలాంటి ధోరణి మానుకోవాలని, ప్రస్తుతం పెరిగిన ధరలతో కుటుంబ పోషణ భారం అవుతున్న విషయాన్ని గ్రహించాలన్నారు. వేతనాలు పెంచే వరకు సమ్మె విరమించేది లేదని హెచ్చరించారు. నాయకులు వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, కిట్టు, మద్దిలేటి, భోగేశ్వరరెడ్డి, మహానంది, కృష్ణారెడ్డి, రామచంద్రుడు, పుల్లయ్యతో పాటు ప్యాపిలి, డోన్ మండలాలకు చెందిన లారీ డ్రైవర్లు, క్లీనర్లు పాల్గొన్నారు.

నాటుసారా విక్రేతల అరెస్టు


నాటుసారా విక్రేతలతో సెబ్ అధికారులు

కొలిమిగుండ్ల: గ్రామాల్లో నాటుసారా విక్రయిస్తున్నారనే సమచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేసి పలువురిని అరెస్ట్ చేసి నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు బనగానపల్లె సెబ్ సీఐ జోగేంద్ర, డీటీఎఫ్ సీఐ విజయ్‌కుమార్ గురువారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఉలవల రామలక్ష్మయ్య నుంచి 40 లీటర్లు, చాకలి నరసింహుడు నుంచి 20 లీటర్లు, బెలుంకు చెందిన బోయ నరసింహుడు నుంచి 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జోగేంద్ర చెప్పారు. ముగ్గురు సారా విక్రేతలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామన్నారు. దాడుల్లో ఎస్ఐ పోతులయ్య, సిబ్బంది వెంకటరమణ, ప్రసన్న, శివన్న, పాములేటి, వెంకటనాయుడు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్‌కు మరమ్మతులు

కొలిమిగుండ్ల: స్థానిక ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌కు గురువారం సర్పంచ్ శివరాముడు మరమ్మతులు చేయించారు. ఐదు నెలల క్రితం రామ్‌కో సిమెంట్ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయించారు. పది రోజుల క్రితం వర్షానికి లైటింగ్‌కు చెందిన కేబుల్ దెబ్బతినింది. దీంతో ప్రధాన రహదారి సాయంత్రం పూట అంధకారం నెలకొనేది. సమస్యను పరిష్కరించేందుకు మరమ్మతులు చేయించినట్లు సర్పంచ్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో లైన్‌మన్ మృతి


మృతి చెందిన మనోహర్

డోన్ రూరల్: మండల పరిధిలోని లక్ష్మంపల్లి గ్రామంలో గురువారం విద్యుత్‌షాక్‌కు గురై మనోహర్ (29) అనే లైన్‌మన్ మృతి చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. ఎరుకలిచెరువు గ్రామానికి చెందిన మనోహర్ డోన్ కరెంట్ ఆఫీస్ పరిధిలో లైన్‌మన్‌గా పనిచేసేవాడని, గురువారం లక్ష్మంపల్లి గ్రామంలో కరెంట్ పని చేస్తుండగా విద్యుత్‌షాక్‌తో మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహానికి డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం బంధువులకు అప్పగించినట్లు చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్యాపిలి: స్థానిక సాయిబాబా ఆలయం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామాంజనేయులు అనే వ్యక్తి గాయపడ్డాడు. అనంతపురం జిల్లా గుత్తి మండలం యంగన్నపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయులు, తన మిత్రుడితో కలిసి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. సాయిబాబా ఆలయం వద్దకు రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పింది. వాహనంపై ఉన్న ఇరువురూ కిందపడగా రామాంజనేయులుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి గురువారం తెలిపారు. బాటనీ పోస్ట్ ఖాళీగా ఉందని, పీజీ బాటనీలో 55 శాతం మార్కులు కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. దరఖాస్తులు చేసుకున్న వారు ఈ నెల 31న నిర్వహించే డెమోకు ఓరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

రేపు రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 27, 28 తేదీల్లో స్థానిక ప్రథమనంది టెంపుల్ ఆవరణంలో రాష్ట్ర స్థాయి జంప్‌రోప్ పోటీలు నిర్వహించనున్నట్లు జంప్‌రోప్ రాష్ట్ర అధ్యక్షులు రమణ, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి, శాంతినికేతన్ స్కూల్ అధినేత సుధాకర్‌లు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ క్రీడా భారతి, జంప్‌రోప్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జంప్‌రోప్ పోటీల్లో 600 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. క్రీడాకారులకు ఎస్పీవై రెడ్డి కూతురు సుజల భోజన వసతి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కల్యాణ్, సుధాకర్, రమేష్, పక్కిరయ్య, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

జలాశయాలకు నీటిని విడుదల చేయాలి


మాట్లాడుతున్న సాగునీటి సాధన సమితి నాయకులు

నంద్యాల(సెంట్రల్): శ్రీశైలం జలాశయానికి భారీగా వస్తున్న వరదతో నీటిమట్టం 854 అడుగులకు చేరినందున పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి నీటిని విడుదల చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుంగభద్ర, కృష్ణా నదుల్లో ఆశాజనకంగా ప్రవాహాలు ఉన్నందున రాయలసీమ జిల్లాలకు సాగునీటిని అందించే కేసీ కెనాల్, ఎస్ఆర్‌బీసీ, తెలుగుగంగ, హంద్రీనీవా ప్రాజెక్టులకు నీటి విడుదలపై వెంటనే సాగునీటి సలహా మండలి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో సమితి ఉపాధ్యక్షులు వై ఎన్ రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు, సొదాగర్ ఖాసీం మియా, భాస్కర్ రెడ్డి, పట్నం రాముడు, రాఘవేంద్ర గౌడ్, మహమ్మద్ పర్వేజ్, మనోజ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.